# ధనం - ఇంధనం

మా వూళ్ళో మా ఇంటి పక్కనే లైబ్రరీ వుండేది. నేను హైస్కూల్లోనూ, కాలేజీలోనూ చదివేటప్పుడు సమయం దొరికినప్పుడల్లా అక్కడికి వెళ్ళి ఎన్నో పుస్తకాలు చదివేవాడిని. శరత్ నవలలూ, సోమర్‌సెట్ మామ్, ఓడ్ హౌస్, ప్రాచీన ఆధునిక తెలుగు సాహిత్యం, ముళ్ళపూడి, రావిశాస్త్రి, బీనాదేవి, బుచ్చిబాబూ, గోపీచందూ, చలం, కొకు రచనలే కాకుండా, ఇటు నాస్తికత్వం మీదా, అటు భగవద్గీతా, ఇటు కమ్యూనిజం మీదా, అటు కాపిటలిజం మీదా ఏది బాగుంటే అది. వీటన్నిటిమీదా మంచి అవగాహన వచ్చిందో లేదో కానీ ఆ సాహిత్యంతో చక్కటి పరిచయం మాత్రం ఏర్పడింది. ముఖ్యంగా చివరగా చెప్పిన ఆ రెండిటి మీదా. పుస్తకాల్లోని నిర్వచనాలు పుస్తకాల్లోనే భద్రంగా వున్నాయనీ, ఆచరణలో నిజంగా కమ్యూనిజమైనా కాపిటలిజమైనా, ఏమైనా ఎవరి ఎజెండాని బట్టి వాళ్ళేం చెబితే అవే చేస్తున్నాయనీ అర్థమయింది. మధ్యలో సోషలిజమొకటి, నాకు మహా శోష తెప్పిస్తుంటుంది. బహుశా అప్పటినించే అనుకుంటాను ఇజాలకన్నా నిజాల మీదే నమ్మకం ఎక్కువయింది నాకు. ఆ రోజుల్లో సోవియట్ యూనియన్ కమ్యూనిజానికీ అమెరికా కాపిటలిజానికీ ఉదాహరణలుగా చెప్పుకునేవారు. అమెరికా వచ్చాక, కాపిటలిజం - పుస్తకాల్లోది కాదు- నిజ జీవితంలో అసలు ఎలా పని చేస్తుంది అని పరిశీలనగా చూడటం మొదలుపెట్టాను.

కాపిటలిజంలో డబ్బు, కమ్యూనిజంలో అధికారం మానవ జీవిత సరళిని నడుపుతూ వుంటాయి. అది సహజమే అయినా కాపిటలిజం అధికారం, కమ్యూనిజం డబ్బూ లేకుండా నడవదు. అందుకని కాపిటలిజంలో కొన్నిపాళ్ళు కమ్యూనిజం, అలాగే కమ్యూనిజంలో కొంత కాపిటలిజం కనపిస్తూవుంటుంది. ఇక్కడ నేను దేశాలలో అంతర్గత జీవితాలగురించి చెబుతున్నాను. రాజకీయాల గురించి కాదు. ఇక అమెరికాలో నేను చూసిన కాపిటలిజం ఎలా వుందో చూద్దాం.

నేను అమెరికా వచ్చిన కొత్తల్లో అనుకునేవాడిని. అమెరికా ఎంత ఇమ్మిగ్రెంట్ల దేశమైనా, ఎక్కడినించో ఇక్కడికి వలస వచ్చిన వారికి ఉద్యోగాలెందుకిస్తున్నారబ్బా అని ఆశ్చర్యం వేసేది. ఉదాహరణకి నన్నే తీసుకోండి. నేను అమెరికా రాగానే నాకు మంచి ఉద్యోగం ఇచ్చారు. నేను మాట్లాడే ఇంగ్లీషులోని నా యాస నాకే తెలుస్తుంటుంది. ఎంతో నెమ్మదిగా చెబితే కానీ వాళ్ళకి అర్థమయేది కాదు. రోజువారీ ఆఫీసు జీవితంలో ఎన్నో విపరీతమైన తేడాలు. అమెరికన్స్‌లో బిజినెస్ చేయటంలో ఏమాత్రం అనుభవం లేనివాడిని. కష్టమర్లతో మాట్లాడాలంటే ఎన్నో కొత్త కమ్యూనికేషన్ టెక్నిక్స్ వాడతారు. నా శరీరపు రంగూ, ముఖ కవళికలూ నేను వాళ్ళ వాడిని కానని మాటిమాటికీ గుర్తు చేస్తుంటాయి. అటువంటిది నాకు ఉద్యోగమెందుకు ఇవ్వాలి? అలాగే ఇల్లు కొనేటప్పుడూ కారు కొనేటప్పుడూ

మన క్రెడిట్ బాగుంటే అప్పులు సులభంగా ఇస్తారు. షాపుల్లో ఏదన్నా కొనేటప్పుడు ముందు చిరునవ్వివిచ్చితర్వాత సామాన్లు ఇస్తారు. మనని ఎండుకలా వాళ్ళల్లో కలిపేసుకుంటున్నారు. పబ్లిక్ కంపెనీ అయినా, ప్రైవేట్ కంపెనీ అయినా వాళ్ళకి ముఖ్యం లాభాలు. డబ్బులు పోగొట్టుకోటానికి ఎవరూ బిజినెస్ చేయరు అన్న సిద్ధాంతం నూటికినూరుపాళ్ళూ వర్తిస్తుంది. వాళ్ళకి కావలసింది తెలివితేటలున్న ఉద్యోగస్తులు. కష్టపడి పనిచేసే మనుష్యులు. సత్తువ వున్నవాళ్ళకి అవకాశాలకి కొదువలేదు. అదీకాక అమెరికా చాల పెద్ద దేశం. ఎంతో తక్కువ జనాభా. ఎన్నో ఉద్యోగాలు. ప్రస్తుతపు ప్రపంచ ఆర్థిక సంక్షోభంలో కూడా మిగతా దేశాల్లో నిరుద్యోగం పదిహేను ఇరవై శాతం వున్నా అమెరికాలో ఆరున్నర శాతం మాత్రమే వుంది. అందుకే నాలాటివారికీ రకరకాల విదేశీయులకి అమెరికాలో ఉద్యోగాలు దొరికేది ఉద్యోగాలకి డిమాండ్‌వున్నప్పుడు, అడిగినంత డబ్బులివ్వటమే కాక సైనప్ బోనసులూ (ఐదూ, పదివేల డాలర్ల దాకా ఇస్తారు), స్టాక్ ఆప్షన్లూ ఆశ చూపించి మంచివాళ్ళని గాలిస్తారు. ఉద్యోగాలిస్తారు. మీవల్ల కంపెనీకి లాభం వుంటే మీ ఉద్యోగానికి ఢోకా లేదు. అలాగే మీ వల్ల ఆ కంపెనీకి లాభం లేకపోతే మర్నాడే ఇంతే సంగతులు. మీరు మంచి ఉద్యోగి అయినా, కంపెనీ నష్టాల్లో వుంటే మళ్ళీ ఇంతే. ఇక్కడ చూసేది నాలుగే నాలుగు. లాభం నష్టం. ఆదాయం. ఖర్చు కంపెనీలు షేర్ హోల్డర్స్‌కి జవాబుదారీ కనుక వాళ్ళని నొప్పించకుండా, ఉద్యోగాలు తీసేయటం చేస్తుంటాయి. ఇది అమెరికా నిత్య జీవితంలో మామూలే కనుక, ఇక్కడదో వింత కాదు. మరి అంతా డబ్బు మీదే ఆధారపడివుంటే, పక్షపాతాలూ బంధుప్రీతీ అసలు వుండవా? ఎందుకువుండవూ వుంటాయి. అది మానవ సహజం వాటినించీ రక్షణ కోసం న్యాయసూత్రాలూ, న్యాయశాస్త్రాలూకూడా వున్నాయి. అక్కడ పక్షపాతం లేకుండా న్యాయం జరుగుతుందా? చాలసార్లు జరుగుతుంది. నా అనుభవంకూడా అవుసూ. నిజమే అని చెబుతోంది.

అలాగే బ్యాంకులన్నీ ప్రైవేటీ బ్యాంకులే కనుక వాటికి లాభంవుంటే, మీరు అప్పు తీరుస్తారనే ధీమావుంటే (మంచి క్రెడిట్ రిపోర్ట్) కారు, ఇల్లు కొనుక్కోటానికి సులభ వాయిదాల్లో అప్పులు కూడా ఇస్తారు.

ఆర్థికపరిస్థితి బాగుండటానికి కారణం ఎక్కువ కొనుగోలు. డబ్బులెక్కువ దాచుకోకుండా ఖర్చుపెడుతుంటే అమ్మకాలుపెరుగుతాయి. అమ్మకాలు పెరిగితే ఉత్పత్తి పెరుగుతుంది. ఉత్పత్తి పెరిగితే ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. ఎక్కువమంది ఉద్యోగాలు చేస్తుంటే కొనుగోలు శక్తి పెరుగుతుంది. కొనుగోలు శక్తి పెరిగితే మళ్ళీ . ఇదొక ఆర్థిక చక్రభ్రమణం. అమెరికాని ఆర్థికంగా ముందుకు తీసుకువెళ్ళిందీ, వెడుతున్నదీ ఇదే. కాకపోతే ఈ కొనుగోలు వల్ల ఆదాయపు నిల్వలు మిగలకపోవటం, కొందరు తలకు మించి అప్పుచేసి ఆర్థికంగా దెబ్బ తినటంలాటివి అప్పుడప్పుడూ వింటూనే వుంటాం.

నేను ఈ దేశంలోవున్న రెండున్నర దశాబ్దాల్లోనూ, ఒక్కరోజు, కనీసం ఒక్కరోజు కూడా సమ్మెలవల్ల ఉత్పత్తి తగ్గినట్టు చూడలేదు. అక్కడక్కడా కొన్ని

యూనియన్లు, ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్లలాంటివి చాల శాంతియుతంగా వాళ్ళ ఆఫీసు పని అయిపోయాక చేతుల్లో బోర్డులు పట్టుకుని సమ్మె చేయటం చూశాం కాని, షాపులని మూయించటం తగలబెట్టటంలాంటివి కనిపించి ఎరగం. ఇలాంటి కారణాల వల్లా, ఉద్యోగాలు పనితనం మీదా, చేసే పని మీదా ఆధారపడివుండటంతో ఇక్కడ ఉత్పత్తి అధికంగా వుంటుంది.

మరి ఇలాంటి సమాజంలో ధనవంతులు ఇంకా ధనవంతులవటం, పేదవాళ్ళు ఇంకా బీదవాళ్ళవటం జరగదా? ధనవంతులు ఇంకా ధనవంతులవటం, తమ సంపాదనని పోగొట్టుకోవటం రెండూ నిజమే. మధ్యతరగతి వాళ్ళు ఆర్థికంగా సుఖంగా వుండటమూ నిజమే. వీళ్ళుకూడా వాళ్ళ సత్తానుబట్టి ధనవంతులవ్వొచ్చు. వంటవారు పనిచేసే బీదవాళ్ళు, కారూ అపార్ట్‌మెంట్‌లో పిల్లల్ని చదివిస్తూ సుఖంగా వుండటం కూడా చూస్తున్నదే. మెక్సికోలాంటి దేశాలనించీ వచ్చిన కార్మికులు, కష్టపడి వాళ్ళ జీవన విధానాన్ని మెరుగుపరుచుకోవటం టెక్సాస్, కాలిఫోర్నియాలాంటి రాష్ట్రాల్లో మామూలుగా జరుగుతూనేవుంది. పనిచేసేవాళ్ళకి అవకాశాలు బాగానే వున్నాయి.

మరి కాపిటలిస్ట్ సమాజంలో నష్టాలేమిటి? ఇందాకనుకున్నట్టుగా ముందు ఉద్యోగి అయినా ఉద్యోగం తక్కున వూడుతుంది. అలా ఉద్యోగం పోయినవారికి వారానికి మూడు వందల డాలర్లదాకా నిరుద్యోగ భృతి ఇస్తారు. అది చాలని వారికీ బాంక్ బాలన్స్ లేనివారికీ ఇంటి అద్దె, అప్పు తీర్చుకోవటం, కారు బాకీలు తీర్చటంకూడా కష్టమే. సమయానికి డబ్బులు కట్టకపోతే క్రెడిట్ దెబ్బలింటుంది. క్రెడిట్ దెబ్బ తింటే అప్పుపుట్టదు. అప్పు చేయకపోతే అమెరికాలో పప్పుకూడు కష్టం.

అలాగే ఇక్కడ రీశెర్చికోసం పేపర్లు రాయటం కాదు. పరిశ్రమలు తమ ప్రాజెక్ట్‌లని రీశెర్చికంపెనీలకీ యూనివర్సిటీలకిచ్చి వాళ్ళకి ఫండ్స్ ఇవ్వటం, వాటితో ఒక నిర్ణీత కాలం ప్రకారం కొత్త ప్రాడక్ట్‌లు తయారుచేయటంవల్ల, ఇక్కడ ఎవరి టైమూ వృధా కాదు. కంపెనీల మధ్య పోటీవల్ల "టైమ్ టు మార్కెట్" ముఖ్యం కనక, రాజకీయాలున్నా పనికి మాత్రం ఆటంకం వుండదు. ఉద్యోగాలకి వయసు నిమిత్తం లేదు. మీరు ఉత్సాహంగా పని చేయగలిగితే, మీ వల్ల ఆ కంపెనీకి లాభాలువుంటే మీ ఇష్టమొచ్చినన్నాళ్ళు పనిచేయవచ్చు. పరిశ్రమలలో కానీ యూనివర్సిటీలలో కానీ ఎక్కడైనా అంతే. గవర్నమెంట్ సంబంధమైన ఆఫీసుల్లో రిటైర్‌మెంట్ నిబంధనలున్నా వాటికీ పరిష్కార మార్గాలున్నాయి. బిజినెస్‌కి లైసెన్సులూ పర్మిషన్లూ అక్కర్లేదు. కొన్ని పరిశ్రమలకి దేశరక్షణ కోసమని అక్కడక్కడా ఆటంకం వుంటుంది కానీ, మిగతావాటికి ఏ గొడవావుండదు. మీ లాభనష్టాలు మీవే.

ఈ కాపిటలిస్ట్ సమాజంలో బ్రతకటం కష్టం కాకపోయినా, అందరూ తెలివితేటలున్నవాళ్ళూ ఉత్సాహంగా ముందుకి వురికే వాళ్ళూ కాదుకదా! వెనకపడితే వెనకేనోయ్ అని ఈ స్పీడు సమాజంలో అలాంటివారు ముందుకు దూసుకుపోవటం మరి కష్టమే!

* * *